# శ్రీరామరాజ్యం

జె.మార్కండేయులు

శ్రీరామరాజ్యం అనగానే లవకుశల కథకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడంవల్ల కథాపరముగ చిత్రం పస చాటలేకపోయింది. రామరాజ్యకాల ఆహార్యము మాత్రము బాపు దిద్దినతీరు అనితరసాధ్యము. ముళ్ళపూడి రచనకథావిధానము మధ్యలోనే ఆగిపోయిందని నాకు అనిపించింది. బాలహనుమంతుడు అవాల్మీకము. ఆ పాత్ర సృష్టించడములో కవి హృదయము తప్పకుండా గమనించబడాలి. లేకపోతే ముత్యాలముగ్గు చిత్రకథాంశంగా మాత్రమే శ్రీరామరాజ్యం మిగిలిపోతుంది.

సీతారాములు అలౌకికస్త్రీ పురుషులు. ఈ విషయం వాల్మీకి- సీత అగ్ని ప్రవేశముతో నిరూపించాడు. భార్యను రక్షించుకోవలసిన భాధ్యత భర్తది. రాముడు అలౌకికపురుషుడు కాబట్టి నర, వానరులతో బాటు ఉడుతవంటి అల్పప్రాణి కూడా సాయంచేసిందనే భావన కల్పనకాదు, యథార్థము. సీత అలౌకికస్త్రీ కాబట్టే అగ్ని చల్లారిపోయింది. భర్త రక్షణ అవసరము, శీలపరీక్ష ఎదురయ్యే పరిస్థితి దుర్భరము. సామాన్య భార్యాభర్తలకు ఇది సాధ్యముకాదు. అలౌకిక దాంపత్య జీవితపు కష్టాలు కన్న అనురాగమే శాశ్వతమన్న వాల్మీకి కథలోని రామాయణ సందేశము పురుషాహంకారాగ్నికి ఉత్తరరామాయణ సందేశముగా నిలిచింది. నాటికాలానికది అవసరమయింది. రాముడివంటి లోకోత్తరపురుషుడు ఉత్తర రామాయణములో పిరికివాడయ్యాడు. జనాపవాదును సీతకు చెప్పి వనవాసం పంపినట్లు చేసి ఉంటే నేటి ప్రేమైకజీవుల కాలానికి ఊరట లభించేది.

అవాల్మీకము తప్ప అనలేము. బాలహనుమంతుడు వాల్మీకి రచనకాదు. అసలు ఉత్తరరామాయణమే అవాల్మీకము అనే వాదన ఉంది. ఆధ్యాత్మ రామాయణంలో

సీతారాములకు అభేదము చెప్పబడింది. తన సహవాసము, ఆజ్ఞ వలననే రాముడు అన్నికార్యాలను చేశాడని సీత హనుమంతునికి తమ అభేద ఆధ్యాత్మ తత్వాన్ని వివరించింది.

జానపద రామాయణములో సీత శతకంఠరావణుడిని సంహరిస్తుంది. విచిత్రమేమిటంటే ఈ శతకంఠరావణుడు దశకంఠరావణుడు మరణించాకా పగబట్టి ఆడదాని పట్ల చులకన భావముతో ఆడుదాని చేతిలోతప్ప ఎవరివల్లా చావులేని బ్రహ్మవరము పొందాడు. మునులు రామునికీ రహస్యముచెప్పి సీతచేత చంపించారు. సప్తసముద్రాలకవతల ఉన్న లంకకు హనుమంతుడు సీతతోసహ్ సమస్త సైన్యాన్ని దాటించి యుద్ధభూమిలో నిలబడతాడు. సీత రాముడు రావణసంహారాలతో తాము అభేదమని జానపదులలో మెలిగారు. బాలహనుమంతుని సీతకు రక్షణ కల్పించిన కల్పన మనోహరమనేకదా అందరూ అంటున్నారు. ముళ్ళపూడి బ్రతికి ఉంటే శ్రీరామరాజ్యంలో ఈకథ చేర్చేవాడని చెప్పడముకాదు నా ఉద్దేశము. భర్త అనుమానము నేటికాలానికి అందవలసిన సందేశముగా భర్త వదిలేస్తే పిల్లలను తండ్రికప్ప చెప్పేవరకు బ్రతికి అంతమయిపోవాలన్న సందేశానికి శ్రీరామరాజ్యంకాదు అన్న విషయాన్ని కొత్తకోణంలో చెప్పేవాడని నాకు అనిపించింది. బాలహనుమంతుడి పాత్ర ప్రవేశమే ఇందుకుదాహరణ. వేదాలలోని కథలలో హరిశ్చంద్రుడు అబద్దాలకోరు. తరువాతికాలంలో సత్యనిష్ఠా గరిష్ఠుడు. పురాణరచనలు కొత్తకోణంలో నేటికాలానుగుణ సందేశ రచనగాలుమారి మునుముందు బాపుగారి కళాఖండముగా రచన కెక్కే ప్రయత్నము జరుగుతుందని ఆశిస్తున్నాను. నిష్కల్మషంగా చెప్పాలంటే 'ముళ్ళపూడి...బాపుల' శ్రీరామరాజ్యం ఒక అద్భుత కళాఖండముగా నిలిచిందని చెప్పడానికి అభిమానిగా గర్వపడుతున్నాను.